పేదలకు శాశ్వత భూహక్కు

- ఇంటి స్థలాలపై పూర్తి హక్కులు కల్పించడం చరిత్రాత్మకం
- లక్షలాది కుటుంబాల సొంతింటి కల నిజం చేసిన సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 358 మంది లబ్ధిదారులకు సేల్ డీడ్స్ అందజేత

సీతంపేట: రాష్ట్రంలో నివసించే ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 35 లక్షల కుటుంబాలకు ఇంటి స్థల పట్టాలు, టిడ్కో ఇళ్లు అందజేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తెలిపారు. నవరత్నాలు పథకాల్లో భాగంగా ఎన్నికల మ్యానిఫెస్టోను నిజం చేస్తూ లక్షలాది కుటుంబాల సొంతింటి కలను నిజం చేశారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ఇంటి స్థలం, టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరడమే లక్ష్యంగా పూర్తి హక్కులు కల్పించారని చెప్పారు. ఉత్తర నియోజకవర్గంలోని బీ–ఫారం స్థలాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు 388 జీవో ప్రకారం వారు నివసిస్తున్న భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాల(సేల్ డీడ్స్) పంపిణీ కార్యక్రమం గురువారం అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని షాదీఖానాలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు సేల్ డీడ్స్ అందజేశారు.

హామీలు నెరవేర్చిన జగనన్న

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ బీ–ఫారం స్థలాలకు సరైన విలువ లేక పిల్లల పెళ్లిళ్లు, చదువులకు, వైద్య చికిత్సలు వంటి అత్యవసరాలకు బ్యాంకులో రుణాలు వచ్చే పరిస్థితి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో అక్కచెల్లెమ్మల కష్టాలను విన్న జగనన్న నాడు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ.. వారు నివసిస్తున్న ఇంటి స్థలాలకు ప్రభుత్వ స్థలాలతో సరిసమానమైన పూర్తి హక్కులు కల్పించి రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇవ్వడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయ పరిధిలో నివసిస్తున్న 148 మందికి, గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయ పరిధిలో నివసిస్తున్న 210 మందికి మొత్తంగా 358 మంది లబ్ధిదారులకు సేల్ డీడ్స్ అందజేసినట్లు చెప్పారు. 45 ఏళ్లుగా పరిష్కారం కాని గాజువాక భూ సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు సీఎం జగన్ భూ హక్కు కల్పించారని, పంచగ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సీతమ్మధార, గోపాలపట్నం తహసీల్దార్లు ఆనంద్ కుమార్, జయ, జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, బర్కత్ అలీ, కె.వి.ఎస్.శశికళ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడా రమణికుమారి, జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, వార్డు అధ్యక్షులు నీలి రవి, పి.సునీత, జేసీఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీష్, వసంతల అప్పారావు, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, దిడ్డి రమేష్, ప్రసాద్, ఐ.రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు


సేల్ డీడ్స్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

భూమి విలువ పెరిగింది



ప్రైవేట్ జాబ్ చేస్తూ 20 ఏళ్ల కిందట రూ.2 లక్షలతో సంజీవయ్య కాలనీలో 87 గజాల బీ–ఫారం స్థలాన్ని కొని అందులో చిన్న ఇల్లు కట్టుకుని భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాను. డబ్బు అవసరమైతే బీ–ఫారం కావడంతో ఇంటిపై బ్యాంకులు లోన్ ఇచ్చేవి కాదు. అధిక వడ్డీకి డబ్బులు అప్పు తెచ్చుకోవాల్సి వచ్చేది. నగరంలో భూమి రేట్లు ఎంత పెరిగినా మా ఇంటికి వర్తించేది కాదు. జగనన్న మా కష్టాలను తీర్చేలా పూర్తి హక్కులు కల్పించారు. ఇపుడు ప్రభుత్వ భూమితో సమానంగా విలువ పెరిగింది. బ్యాంకు లోన్ వస్తుంది. చాలా సంతోషంగా ఉంది.

– పి.వి.ప్రవీణ్, సంజీవయ్య కాలనీ

పూర్తి హక్కు కల్పించారు



నా భర్త పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తూ ఆదా చేసిన డబ్బులతో 25 ఏళ్ల కిందట రూ.2 లక్షలతో 87 గజాల స్థలం కొన్నాం. బీ–ఫారం కావడంతో పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఇంటిపై అప్పు పుట్టేది కాదు. చాలా ఇబ్బందులు పడ్డాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు కల్పించి పట్టాలు ఇచ్చారు. ఇపుడు మా ఇంటి స్థలం విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందంటున్నారు. చాలా ఆనందంగా ఉంది. జగన్ మేలు ఎప్పటికీ మర్చిపోను.

– పి.వరలక్ష్మి, సంజీవయ్య కాలనీ

బ్యాంకు లోన్ వస్తుంది



నా భర్త చెరుకు బండి నడుపుతుంటారు. కూడబెట్టిన డబ్బులతో 12 ఏళ్ల కిందట రూ.4 లక్షలు పెట్టి కైలాసపురం రామాలయం వద్ద 45 గజాల స్థలం కొన్నాం. అందులో చిన్న ఇల్లు కట్టుకుని పాప, బాబుతో కలిసి ఉంటున్నాం. ఇపుడు పట్టా ఇచ్చారు. అవసరానికి బ్యాంకు వారు ఇంటిపై లోన్ కూడా ఇస్తారని అంటున్నారు. ఇకపై అధిక వడ్డీలకు అప్పులు తేనక్కరలేదు. జగన్‌బాబు చేసిన మేలు మర్చిపోకుండా రుణం తీర్చుకుంటాం.

– లగుడు మంగ, కైలాసపురం

జగనన్నకు రుణపడి ఉంటా..



నా భర్త కేబుల్ ఆపరేటర్. 18 ఏళ్ల కిందట రూ.2.30 లక్షలతో కైలాసపురంలో 90 గజాల స్థలం కొని ఇళ్లు కట్టుకున్నాం. బాబు బీ ఫార్మసీ, పాప బీటెక్ చదువుతున్నారు. పిల్లల ఉన్నత చదువుకు సైతం ఇంటిపై బ్యాంకు వాళ్లు లోన్ ఇవ్వమని పొమ్మన్నారు. సీఎం జగన్ దయవల్ల రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇచ్చారు. తక్కువలో తక్కువ గజం ధర రూ.50 వేలు లెక్కన చూసినా, ఇపుడు మా ఇంటి స్థలం విలువ రూ.45 లక్షలకు పెరిగింది. ఇంత ఆస్తి కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటా.

– ఆర్.పుష్ప, కైలాసపురం

క్లుప్తంగా

కవాలి నిర్వహణకు కె.కె.రాజు విరాళం


మసీదు కమిటీ సభ్యులకు రూ.40 వేల విరాళం అందజేస్తున్న కె.కె.రాజు

మర్రిపాలెం: ఖాదర్‌వల్లి హజరత్ మౌల అలీ నిషాని ఉరుసు పండగను ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆకాంక్షించారు. అబిద్‌నగర్ షాదీఖానాలో గురువారం నిర్వహించిన సేల్ డీడ్స్‌పంపిణీ కార్యక్రమ అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింలు ఏటా ఎంతో పవిత్రంగా జరుపుకునే పండగల్లో ఉరుసు ఒకటని పేర్కొన్నారు. ఈ పండగ నిర్వహణలో భాగంగా కవాలి కార్యక్రమానికి గాను కె.కె.రాజు రూ.40 వేల విరాళాన్ని జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉల్లి విక్రయాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో ఉల్లిపాయల కోసం వినియోగదారులు బారులు తీరారు. సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో ఉల్లితోపాటు కూరగాయలు బజార్‌లో లేకపోవడంతో వ్యాపారాలు సాగలేదు. నాలుగు రోజులుగా రైతులు లేక వెలవెలబోయిన రైతుబజార్.. గురువారం వినియోగదారులతో కిటకిటలాడింది. భారీగా జనం రావడంతో బజార్ ఈవో, సహాయకుడు స్పందించి నాలుగు ఉల్లి విక్రయాల కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుని ఉల్లిపాయలు కొనుగోలు చేశారు. కర్నూల్ ఉల్లి(ఎరుపు) కిలో రూ.22, మరో క్వాలిటీ కిలో కిలో రూ.24 చొప్పున విక్రయించారు.

పోలీసుల అదుపులో జూదరులు

మర్రిపాలెం: పేకాట శిబిరంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు మహిళలతోపాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ బాలయ్యశాస్త్రి లేఅవుట్, 11 కేవీ శాంతిపురం, 11 కేవీ సీతంపేట ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎస్‌ఆర్‌ఐ హాస్పిటల్, బీఎస్ లేఅవుట్, మోర్ సూపర్ మార్కెట్, శాంతిపురం, సీతంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

'ఉక్కు ఉద్యోగుల తొలగింపు సరికాదు'

ఉక్కునగరం: ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తగవని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. వాటిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం యూనియన్ నాయకులు సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫీను కలిసి సమస్యలపై చర్చించారు. సుమారు 1500 మంది తొలగిస్తారని వస్తున్న వార్తలు ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో అన్ని విభాగాలు సతమతమవుతుంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొమ్ము ప్రసాదరావు, కె.అవతారం, వి.ఎం.నాయుడు, సుబ్బయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

జగదాంబ: ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. 35వ వార్డులోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో గురువారం ఆయన జోనల్ కమిషనర్ శివప్రసాద్, క్రీడా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరిగాయన్నారు. అందులో గెలుపొందిన జట్లతో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్రీడాకారులకు కావాల్సిన వసతులు, అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్ సిద్ధం చేయాలన్నారు. క్రీడల ప్రారంభానికి రూ.25 వేలు మంజూరు చేసినట్లు చెప్పారు.


ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ సంషుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు


స్వర్ణపుష్పాలు


నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువు దీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి కమనీయంగా కల్యాణం జరిపించారు. అర్చకులు టి.పి. రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మాలత ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.దేముడుబాబు, దుంగి శ్రీనివాసరెడ్డి, శివశంకర్, దల్లి అప్పలరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్ ఆధ్వర్యంలో సంఘం ఆఫీస్ కూడలి వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బిర్లా జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి వరప్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

స్థానిక నాయకులు సనపల రామచంద్రరావు, ఎన్‌టీఎస్ కుమార్, అజయ్, నాగన్న, ఎస్.విజయ్‌కుమార్, కె.వరదరాజు, ఎన్.సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, ఎం.రాము, సత్యవతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఎంవీపీ కాలనీ: ఆర్టీసీ డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు కోరారు. వాల్తేర్ డిపోలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను బస్టాప్‌ల వద్ద క్రమ పద్ధతిలో నిలపాలన్నారు. బస్సుల్లో ఫుట్‌పాత్‌లపై యువకులు నిలుచోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎ.గణేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇంజినీరింగ్, ఇన్‌ఫోర్స్‌మెంట్, భద్రత చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

సీఎం జగన్ ఆశయం.. ఆరోగ్యాంధ్ర

- జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు
- 45వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం


కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్న హనోకు


మహిళకు మందులు, కేస్ షీట్ అందజేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, వైద్య సిబ్బంది

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయమని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు అన్నారు. ఆ దిశగా సీఎం అడుగులు వేస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని పేర్కొన్నారు. వార్డులోని 252 సచివాలయం పరిధి ప్రజలకు నరసింహనగర్ జీవీఎంసీ పార్క్ సమీపంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఎవరూ రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఉండాలని, అవసరమైన వైద్య సేవలన్నీ ప్రజల ముంగిటకే చేరుస్తున్నారన్నారు. ఉచితంగా పలు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, అన్ని రకాల మందులను ఉచితంగా అందచేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

442 మందికి వైద్య సేవలు

వైద్య శిబిరంలో జనరల్, గైనిక్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఆప్తాల్మిక్, డెంటల్ వంటి స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని ప్రజలకు సేవలందించారు. మొత్తంగా 442 మంది వైద్య సేవలందుకున్నారు. వీరిలో అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రిఫరల్ కూడా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పిల్లి నూకరాజు, యూపీహెచ్‌సీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, జీవీఎంసీ ఏఈ ఉమామహేశ్వరరావు, ఏపీడీ పద్మావతి, సీవో రమణి, ఆర్పీలు, పార్టీ నాయకులు హరి పటాన్నాయక్, రాజు యాదవ్, ఉత్తరాంధ్ర యాత సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


బీపీ, సుగర్ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చెంతకే వైద్య సేవలు



గతంలో ఏ రోగమొచ్చినా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బు ఖర్చు పెట్టుకునేవాళ్లం. ఇప్పుడు వలంటీర్ మా దగ్గరకు వచ్చి మాకు దగ్గర్లోనే వైద్య సేవలను అందజేస్తున్నారని చెప్పి, ఇక్కడికి పంపించారు. డాక్టర్లు పరీక్షలన్నీ ఉచితంగా చేసి, మందులు కూడా ఇచ్చారు. ఎప్పుడు ఇటువంటి సేవలను చూడలేదు.

– దాకమర్రి సముద్రం, నరసింహనగర్

ఉచిత వైద్యం సంతోషకరం



మేము వలస వచ్చి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ నివసిస్తున్నాం. మాకు కూడా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారని వలంటీర్ తెలియజేశాడు. నాకు, నా భార్యకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. ఎక్కడికీ వెళ్లకుండా మా చెంతకే ఈ సేవలను తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది.

– వై దయానందం, నరసింహనగర్

సింహగిరిపై 'స్వచ్ఛ తీర్థ'


సింహగిరిపై శుభ్రం చేయిస్తున్న ఉద్యోగి

సింహాచలం: సింహగిరిపై గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింహగిరిపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ రాజగోపురం వద్ద ఉన్న చెత్తను తొలగించారు. దేవస్థానం ఉద్యోగి లంక సూరిబాబు, శానిటేషన్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారు దగ్ధం

ఆరిలోవ: హెల్త్ సిటీ పక్కన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న ఓ కారు గురువారం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ఈ రోడ్డులో ఓ కారు(టాటా వింగర్) మరమ్మతులకు గురికావడంతో ఏడాది నుంచి నిలిపి వదిలేశారు. ఇది ఎవరిదో తెలియదు. స్థానిక చిన్నారులు కొందరు గురువారం మధ్యాహ్నం ఈ కారు తలుపు తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులో ఉన్న పిల్లలు భయంతో బయటకు వచ్చి పరుగులు తీశారు. పెద్ద మంటలు, దట్టమైన పొగ రావడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొందరు యువకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా యువకులు నీళ్లు చల్లి మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించారు. ఇంతలో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఎగసిపడుతున్న మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే కారు అంతా దగ్ధమైంది. ఇదిలా ఉండగా పాడైన కారు నుంచి మంటలు ఎలా వచ్చాయో అనే దానిపై అగ్నిమాపక సిబ్బందికి కూడా స్పష్టత రాలేదు. పిల్లలు అగ్గిపెట్టెలు పట్టుకుని ఆడుకుంటూ పుల్లలు వెలిగించడం వల్లే కారులో సీట్లు కాలిపోయి మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నట్టు కొందరు స్థానికులు తెలిపారు.


కారు నుంచి ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ

ప్రభుత్వరంగ సంస్థలను రక్షించుకుందాం

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే పుట్టగతులుండవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపడుతున్న నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,022వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి, జిల్లా కమిటీ సభ్యుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు మానుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వై.రాజు, జి.వి.రమణ, వి.తులసీరాం, జేఆర్ నాయుడు, కె.కుమారి, ఆర్.శ్రీను, వి.కృష్ణారావు, ఆర్.వి.ఎస్.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1,071వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1071వ రోజుకు చేరుకున్నాయి.